TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com
అనునిత్యం అక్షరసత్యం

సంచిక: 24 సంపుటి: 03 ఎడిటర్: సీతార్ల సురేష్ శుక్రవారం 11 ఏప్రిల్ 2025 పేజీలు: 8

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

# యంగ్ ఇండియా పోలీసు స్కూల్ అత్యంత ముఖ్యమైనది: రేవంత్ రెడ్డి

**జనంవెలుగు, హైదరాబాద్:–** మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యాసంస్థ ప్రారంభోత్సవ శిలాఫలకాన్నిసీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. తదుపరి రంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తరగతి గదులను సిఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసులకు యంగ్ ఇండియా పోలీసు స్కూల్ అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. పోలీసుశాఖపై తమకు స్పష్టమైన ఆలోచన ఉందని అన్నారు.కొందరు ఉద్యమ నేతలం, తెలంగాణ ప్రదాతలమని అనుకుంటున్నారని చెప్పారు. యంగ్ ఇండియా అనేది తన బ్రాండ్ అని తెలియజేశారు.16 నెలలైన బ్రాండ్ ఎందుకు సృష్టించుకోలేదని కొందరు అడిగారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల్లో కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉందని, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కు



నిధులు సమకూర్చుకోవాలని వెల్లడించారు. రూ. 100 కోట్లతో కార్పస్ ఫండ్ ను సమకూర్చుకోవాలని కోరారు. నిధుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. యంగ్ ఇండియాలో భాగంగా చదువు, ఉపాధే తమ బ్రాండ్ అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎల్పీజీ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**జనంవెలుగు, హైదరాబాద్:–** కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడానికి నిరసిస్తూ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నాచౌక్ లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 2014లో యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్యాస్ ధర 400/– పెట్రోల్ లీ. ధర 65/–, డీజిల్ 50/– ఉండిందన్నారు. అయినా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల తగ్గింపుకై 2014 ఎన్నికల సమయంలో బీజేపీ పార్టీ పెద్ద



ఎత్తున ఆందోళనలు చేసి, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కు స్మృతి ఇరానీ చీర, గాజులు పంపిందన్నారు. తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని ఓట్లు దండుకున్నారన్నారు. కానీ గత 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ మోడీ ప్రభుత్వం 400 గ్యాస్ ధరను వెయ్యి రూపాయలు దాటించిందన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు విపరీతంగా తగ్గినా, పెట్రోల్, డీజిల్ ధరలను సెంచరీ దాటించిందన్నారు. రాష్ట్రాలకు దక్కాల్సిన సెస్సు పన్నును కూడా కేంద్రం దోచుకుంటుందని ఆరోపించారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలే కాకుండా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను 50 శాతం పైగా తగ్గించాలని, నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కుల మతాల పేరుతో విద్వేషాలు రగిలించి, ప్రజల్ని విడదీసి, కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వ దమననీతిని నిరసించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, టియుసిఐ జిల్లా నాయకుడు విటల్, గంగాధర్, పి డి ఎస్ యు జిల్లా నాయకులు మహిపాల్ , పీఓడబ్ల్యు నాయకులు నర్సక్క, సునంద, అమూల్య, లలిత, సరస్వతి, నాగరాణి, గీత, లహరి, ఫర్జానా, వెంకవ్వ తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలకు వ్యతిరేకంగా జైల్ భరో మద్దతుగా నిలిచిన బీసీ రాజ్యాధికార సమితి

**జనంవెలుగు, హైదరాబాద్:–** బహుజన ముక్తి పార్టీ, బాంసేఫ్ ఆధ్వర్యంలో ఈవీఎంలకు వ్యతిరేకంగా బహుజన జాతీయ నాయకులు దాసు రామ్ నాయక్ నేతృత్వంలో కొనసాగిన జైలు భరో కార్యక్రమంలో అరెస్టు అయ్యి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు చేరుకున్న కార్యకర్తలకు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా అనుమానాలు రేకెత్తుతున్న తరుణంలో ఈ పరంపరను నిలిపివేసి బ్యాలెట్ బాక్సులలో ఓట్లను లెక్కించాలని దాసు సురేష్ డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే దేశ జనాభా గణనలో కులాల వారీ గణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా



ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ అమలును ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బహుజన ముక్తి పార్టీ కార్యదర్శి అంసోల్ లక్ష్మణ్, బీసీ రాజ్యాధికార సమితి గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు తాళ్ల భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో షకీల్

**జనంవెలుగు, హైదరాబాద్:–** వివిధ కేసుల్లో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. కేసులు నమోదు అయినప్పటి నుంచి ఆయన దుబాయ్‌లో



ఉంటున్నారు. తల్లి చనిపోవడంతో హైదరాబాద్ వచ్చిన షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలుస్తోంది. తల్లి చనిపోవడంతో ఆయన దుబాయ్ నుంచి వచ్చారు. వచ్చిన వెంటనే శంషాబాద్ ఎయిర్‌పోర్టులో షకీల్‌ను హైదరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. అయితే తల్లి అంత్యక్రియలు పూర్తి చేయాల్సి ఉందని చెప్పడంతో దానికి అనుమతి ఇచ్చినట్టు చెబుతున్నారు. తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత ఆయనపై చాలా కేసులు నమోదు అయ్యాయి. వాటిలో అరెస్టు తప్పదని గ్రహించి దుబాయ్ వెళ్లిపోయారు. దుబాయ్‌లో ఉన్న షకీల్‌పై పోలీసులు అరెస్టు వారెంట్, లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించిన షకీల్‌ను రప్పించలేకపోయారు. అయితే ఇంతలో అనారోగ్యంతో తల్లి మృతి చెందారు. షకీల్ రాక తప్పలేదు. వచ్చిన వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. షకీల్ కుమారుడు కూడా హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. షకీల్ కుమారుడు రాహిల్ ఆమిర్ 2022లో జూబ్లీహిల్ జరిగిన హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో శిశువు చనిపోయాడు. తర్వాత 2023 డిసెంబర్‌లో కూడా అలాంటి ప్రమాదం జరిగింది. ప్రజాభవన్ ముందు పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఢీ కొట్టి వెళ్లిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తే సంబంధం లేని వ్యక్తులను అందులో ఇరికించేందుకు యత్నించినట్టు కూడా ఆరోపణలు ఉన్నాయి. కొందరు పోలీసులతో కుమ్మక్కై అతన్ని తప్పించారని విచారణలో తేలింది. హిట్ అండ్ రన్ కేసులో కుమారుడిని తప్పించడంలో షకీల్‌దే కీలక పాత్ర అని పోలీసులు అనుమానించారు. ఈ దిశగానే కేసును విచారించారు. కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు ఆయన పాత్రను కన్ఫామ్ చేశారు. కేసు నమోదై విచారణ సాగుతున్న టైంలోనే షకీల్ కూడా దుబాయ్ పారిపోయారు. పోలీసుల అరెస్టు నుంచి తప్పించుకోవడానికి తండ్రీకుమారుడు దుబాయ్‌లో తలదాచుకున్నారు. షకీల్ పూర్తి పేరు మొహమ్మద్ షకీల్ ఆమిర్. బీఆర్ఎస్ తరపున పోటీ చేసి 2014, 2018 రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డిపై విజయం సాధించారు. తర్వాత 2024 ఎన్నికల్లో మాత్రం అదే సుదర్శన రెడ్డి చేతిలో ఓటమిపాలయ్యారు.

## మోర్తాడ్ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**జనంవెలుగు, నిజామాబాద్:–** మోర్తాడ్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్



తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పట్టికలో పొందుపర్చిన వాటికి అనుగుణంగానే ఆహార పదార్థాలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఉడకబెట్టిన కోడిగుడ్లు, నిర్ణీత రోజులలో మాంసాహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. భోజనం తయారు చేసేందుకు వినియోగించే ఆహార పదార్థాలు, సరుకులు, కూరగాయలు కలుషితం కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నాసిరకమైన బియ్యం, ఇతర ఆహార పదార్థాలు, కూరగాయలు సరఫరా చేసిన సమయంలో అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, ఎంపీడీఓ తిరుమల, తహశీల్దార్ కృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.స్వప్న తదితరులు ఉన్నారు.

